భయం భయంగా..

- పచ్చని పొదల మధ్య పొంచి ఉన్న ప్రమాదం
- ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లలో అల్లుకున్న తుప్పలు
- శుభ్రం చేయించని అధికారులు
- టీఎల్‌సీ కార్యాలయంలో కనిపించిన కొండచిలువ
- ఆందోళన చెందుతున్న సిబ్బంది


డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం నుంచి వెళ్లే రోడ్డులో పరిస్థితి..


టీఎల్‌సీ కార్యాలయంలోకి వచ్చిన భారీ కొండచిలువ (ఫైల్)


టీఎల్‌సీ కార్యాలయం నుంచి టిడ్కో గృహాలకు వెళ్లే రోడ్డులో ఇరువైపులా పెరిగిన పొదలు

రాజమహేంద్రవరం రూరల్: ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రహదారులు పచ్చని పొదలతో అల్లుకుపోయాయి. ఈ తుప్పలు, పొదల్లో ఏ విషసర్పాలు ఉన్నాయో వాటి వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటోందని ఉద్యోగులు, పరిసర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల బొమ్మూరు గ్రామంలోని టీఎల్‌సీ కార్యాలయంలో భారీ కొండచిలువ రావడంతో ఉద్యోగులు వెంటనే హతమార్చారు. ఇంకా ఇటువంటి విషసర్పాలు ఎన్ని ఉన్నాయోనని ఉద్యోగులు భయపడుతున్నారు.

బొమ్మూరు గ్రామంలో జిల్లా ప్రభుత్వ కార్యాలయాలు డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం, జిల్లా స్త్రీ శిశు సంక్షేశాఖాధికారి కార్యాలయం, మహిళా ప్రాంగణం, రూరల్ తహసీల్దార్ కార్యాలయంతోపాటు వైటీసీ ప్రాంగణంలో పది వరకు ప్రభుత్వ జిల్లా కార్యాలయాలు ఉన్నాయి. ప్రతి కార్యాలయం చుట్టూ పచ్చని పొదలు అడవులను తలపిస్తున్నాయి. స్వచ్ఛాంధ్రా-స్వర్ణ ఆంధ్రా కార్యక్రమాల సమయంలో ఫొటోలు వరకు మాత్రమే తూతూ మంత్రంగా శుభ్రం చేసినట్టు నటించడం అధికారులకు పరిపాటిగా మారిపోయింది. ఆ ప్రాంతంలో సరైన విద్యుద్దీపాలు సైతం లేకపోవడంతో రాత్రి సమయాల్లో ఉద్యోగులు ఇంటికి వెళ్లే సమయంలో పచ్చని పొదలు నుంచి ఏ విషసర్పం వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు.

కార్యాలయాలకు వెళ్లే రోడ్లు అంతే..

జిల్లా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్లకు ఇరువైపుల పచ్చని మొక్కలు గుబురుగా పెరిగిపోయాయి. ఇటీవల ఏపీ ట్రాన్స్‌కో టీఎల్‌సీ కార్యాలయంలో మొక్కలను మహిళలు తీస్తుండగా భారీ కొండచిలువ కనిపించింది. దీంతో వెంటనే అక్కడ ఉన్న సిబ్బంది ఆ కొండచిలువను హతమార్చడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. టీఎల్‌సీ కార్యాలయం గోడ పక్క నుంచి టిడ్కో గృహాలకు వెళ్లే రహదారి ఉంది. ఈ రహదారిలో ప్రతిరోజు టిడ్కో గృహాలు, వాంబే గృహాలు, రాజీవ్ కాలనీ, డైట్, ఐటీఐకు వెళ్లే వారు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో ప్రయాణించేటప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు పరిస్థితి అంతే. ఇరువైపులా మొక్కలు పెరిగిపోయి ఉన్నాయి. రాత్రి సమయాల్లో ఆ రోడ్డులో కనీసం వీధి దీపాలు సైతం లేవు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అడవిని తలపించే పచ్చని పొదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు అటవీ అధికారులతో సమావేశం

కడియం: భారీ వృక్షాలను రీప్లాంటేషన్ చేసే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ (డీఎఫ్‌వో)తో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్టు నర్సరీ అసోసియేసన్ అధ్యక్షుడు రత్నం అయ్యప్ప తెలిపారు. కడియపులంకలోని నర్సరీ అసోసియేషన్ కార్యాలయలలో జరిగే సమావేశానికి రైతులంతా తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

గంగాలమ్మ తల్లికి పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సీటీఆర్ఐ: స్థానిక కోటిలింగాల ఘాట్ వద్ద గంగ పుత్రుందరూ కలసి ఛత్రపతి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గంగాలమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. గోదావరి నదిపై ఆధారపడి జీవించేవారు మొసలి వాహనంపై గంగాలమ్మతల్లి విగ్రహాన్ని దసరా సందర్భంగా ప్రతిష్ఠించారు. గోదావరిలో ఇసక తీయడానికి వెళ్లే వారు, పుల్లలు ఏరుకుని జీవించే వారు, చేపలు పట్టి జీవనాధారంగా బతికే వారు ఒక సర్కిల్‌గా ఏర్పడి ఈ అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

పని గంటల బిల్లును ఉపసంహరించుకోవాలి


శ్యామల సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ప్రకాశం నగర్: అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పని గంటల బిల్లును ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పవన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక శ్యామల సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులకు పని సమయం 8 గంటల నుంచి 10 గంటలకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని మార్చడం దుర్మార్గమని మండిపడ్డారు. రాష్ట్ర అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పని వ్యతిరేక బిల్లును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌లోని అంశాలను కూటమి ప్రభుత్వం అమలు చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.అరుణ్, ఎస్.మూర్తి, బి.పూర్ణిమ రాజు, ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి స్వచ్ఛతా అవార్డు


కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వీరేంద్ర

రాజమహేంద్రవరం రూరల్: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర 2025లో భాగంగా స్వచ్ఛ గ్రామ పంచాయతీ జిల్లా స్థాయి అవార్డును వెంకటనగరం పంచాయతీ కార్యదర్శి వడ్డి వీరేంద్ర జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ మేఘాస్వరూప్ చేతుల మీదుగా అందుకున్నారు. సోమవారం సాయంత్రం స్థానిక ఆనం కళా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆయన కలెక్టర్, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అలాగే వెంకటనగరం గ్రామ పంచాయతీకి చెందిన గ్రామ స్వచ్ఛత గ్రీన్ అంబాసిడర్‌గా కుసుమ వీరపండు అవార్డు అందుకున్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేత


దుద్దుకూరులో క్రీడాకారులకు దుస్తులు అందజేసిన పైడియ్య

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు రంగరాయ జిల్లా పరిషత్ హైస్కూల్లో పని చేసి రిటైర్ అయిన యెల్లపు పైడియ్య క్రీడాకారులకు ఉచితంగా క్రీడా దుస్తులు అందజేశారు. దుస్తులను మంగళవారం ప్రధానోపాధ్యాయులు వీర్రాజు సమక్షంలో విద్యార్థులకు అందజేశారు. సుమారు రూ.15 వేల వ్యయంతో దుస్తులు కొనుగోలు చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె.రామ్‌కుమార్, అల్లూరి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయానికి చేరిన భక్తులు

మురమండ నుంచి వచ్చిన 40 మంది


పౌర్ణమి ప్రదక్షిణకు ద్రాక్షారామం చేరుకున్న మురమండ భక్త బృందం

కడియం: పౌర్ణమి సందర్భంగా దక్షిణ కాశీగా పేరొందిన ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామివారి ఆలయ ప్రదక్షిణకు భక్తులు శ్రీకారం చుట్టారు. కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన 40 మంది భక్తులు మంగళవారం భీమేశ్వరాలయ ప్రదక్షిణ చేసేందుకు తరలివెళ్లారు. గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక ప్రముఖులు ఆకెళ్ళ రవిరామచంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని ప్రతి పౌర్ణమికి నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. 14 అడుగుల స్వయం స్థాపిత శుద్ధ స్ఫటిక లింగం, అష్టాదశ శక్తిపీఠాల్లో 12వ శక్తిపీఠమైన మాణిక్యాంబ అమ్మవారు వెలసిన ఈ క్షేత్రంలో పౌర్ణమి ప్రదక్షిణ ఎంతో ఫలప్రదమని ఆయన వివరించారు.

ఒత్తిడిని జయిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం

- మానసిక ఆరోగ్య కౌన్సిలర్ విజయసురేష్
- పాఠశాలల్లో మానసిక ఆరోగ్య వారోత్సవాలు


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయసురేష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విద్యార్థులు ఒత్తిడిని జయిస్తేనే సంపూర్ణ ఆరోగ్యంతోపాటు ఉత్తమ విద్యను అందుకోగలరని జిల్లా మానసిక ఆరోగ్య కౌన్సిలర్ కె.విజయ సురేష్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఆల్కాట్‌తోటలోని శ్రీనివాసరామానుజ నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయిని సత్యవతి అధ్యక్షతన విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విజయ సురేష్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఆరోగ్య ప్రాముఖ్యత, ఒత్తిడిని జయించడం, భావోద్వేగాల సమతుల్యత తదితర విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయాలని, సరైన నిద్ర ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యార్థులు తమ సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, నమ్మకమైన స్నేహితులను ఎంచుకోవాలని సూచించారు. జ్ఞాపకాలు, కృతజ్ఞతలన చిన్న డైరీలో రాసుకునే అలవాటు చేసుకోవాలని విజయ సురేష్ వివరించారు. హెచ్‌ఎం సత్యవతి మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకుంటూ అన్నింటిలోనూ ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఈసీ సభ్యులు ఆకుల వీర్రాజుకు అభినందన


ఆకుల వీర్రాజును అభినందిస్తున్న పార్టీ నాయకులు

కడియం: వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (సీఈసీ) సభ్యులుగా ఎంపికైన డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజును కడియం మండలానికి చెందిన పలువురు నాయకులు మంగళవారం కలిసి అభినందించారు. కార్యక్రమంలో సంగీత వెంకటేశ్వరరావు, నందపునీడి గంగారావు, బుడ్డిగ వీరవెంకట్రావుగౌడ్, బుల్లిరాజు పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం


సాయం అందిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: మురమండ వీవర్స్ కాలనీకి చెందిన దైవపు బూరయ్యకు రాము, లక్ష్మీలహరి కవల పిల్లలు, అయితే ఆర్థిక ఇబ్బందుల కారణంగా వీరి చదువు నిలిచిపోయిందని రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన వెంటనే స్పందించి సోమవారం ఆ విద్యార్థుల చదువు కోసం రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో మురమండ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ మృతి


రామచంద్రరావు (ఫైల్)

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ మాజీ కార్పొరేటర్ నేతల రామచంద్రరావు(75) మంగళవారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు. ఆయనకు భార్య నాగమణి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. రామచంద్రరావు పార్థివదేహం ఐటీసీఏల్‌లోని ఆయన స్వగృహం వద్ద ఉంచారు. బుధవారం ఇన్నీసుపేట కైలాస భూమిలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. రామచంద్రరావు నగరపాలక సంస్థ ఏర్పడిన తరువాత తొలిపాలక వర్గంలో ఒకటో వార్డు కార్పొరేటర్‌గా ఆల్కాట్‌తోట ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. నేతల రామచంద్రరావు మృతిపై రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రూరల్ నియోజకవర్గ అధ్యక్షుడు చీకురుమిల్లి చిన్న, రాష్ట్ర టీడీపీ వైద్య విభాగ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్, వైఎస్సార్ సీపీ నాయకుడు నాగిరెడ్డి తదితరులు సంతాపం తెలిపారు.

ఘనంగా వాల్మీకి జయంతి


వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎస్పీ నరసింహకిశోర్

కంబాలచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఎస్పీ డి.నరసింహ కిశోర్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి సంస్కృత సాహిత్యంలో గొప్ప పేరు కలిగిన వ్యక్తి అన్నారు. అందుకనే ఈయనను సంస్కృత భాషకు ఆదికవిగా గుర్తించారన్నారు. రామాయణ మహాకావ్యాన్ని లిఖించి అందరి హృదయాల్లో చిరస్థాయిగా చెరగని ముద్ర వేసుకున్నారన్నారని, ఆధునిక సమాజానికి ఆదర్శప్రాయంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు యంబీఎస్.మురళీకృష్ణ ఏవీ సుబ్బరాజు, డీఎస్పీలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

విద్యాశాఖ కార్యాలయంలో..

పవిత్ర రామాయణ ఇతిహాస రచయిత వాల్మీకి జయంతిని స్థానిక కోటగుమ్మం వద్ద నున్న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో నిర్వహించారు. డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ వి.వెంకట్రారాజు మహర్షి వాల్మీకి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయ ఐటీ వింగ్ సత్తిబాబు, కార్యాలయ సిబ్బంది రాధాకుమారి, సురేఖ, శైలజ, సుందరి, కామేశ్వరి, శిరీష, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించారు. ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్ నరసింహం మాట్లాడుతూ రాముడ్ని ఆదర్శమూర్తిగా చూపి భారత సంస్కృతి, సాంప్రదాయాలకు నిలువుటద్దంగా రామాయణాన్ని వాల్మీకి రచించాడన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ బోను రామకృష్ణ, కే.శివరామకృష్ణ, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన


వీసీని కలసిన అనంతరావు

రాజమహేంద్రవరం సిటీ: యువత వినియోగదారులుగా తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవడం అత్యంత అవసరమని ఆదికవి నన్నయా యూనివర్సిటీ అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.ప్రసన్నశ్రీకి విజ్ఞప్తి చేశారు. మంగళవారం యూనివర్సిటీలో మర్యాదపూర్వకంగా కలిశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న మార్కెట్ వ్యవస్థలో విద్యార్థులు జాగ్రత్తగా, చట్టపరంగా అవగాహనతో ఉండాలని అందుకు అవసరమైన అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలల్లో వినియోగదారుల అవగాహన సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. విద్యార్థులలో చట్టాలు, న్యాయపరమైన అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.స్వామి పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజం అందరి బాధ్యత


మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారి రాంబాబు

రాజానగరం: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని భారత ప్రభుత్వం విజిలెన్స్ డే గా జరుపుకొంటున్నామని విజిలెన్స్ అధికారి ఈ రాంబాబు అన్నారు. ఏపీ గ్రామీణ బ్యాంకు, దివాన్‌చెరువు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పాలచర్ల, జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. అవినీతి రహిత సమాజ నిర్మాణంలో అందరి బాధ్యత ఉండాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా రెండు నెలలపాటు అవినీతికి వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఏపీ గ్రామీణ బ్యాంకు ఆర్ఎం జి. శ్రీనివాసరావు, బీఎం పి.రత్నకుమారి, హెచ్ఎం జి.సీతారామయ్య, యూనియన్ నాయకులు సీహెచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రకు అవార్డుపై హర్షం

నిర్వాహకుడు రాంబాబును సత్కరించిన అదనపు ఎస్పీ


గుబ్బల రాంబాబును సత్కరిస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: స్వచ్ఛతకు సంపూర్ణ గుర్తింపుగా స్వర్ణాంధ్ర సేవా సంస్థకు ఉత్తమ స్వచ్ఛత సేవా అవార్డు అందించడంతో హర్షణీయమని జిల్లా అదనపు ఎస్పీ ఎన్‌బీఎం మురళీకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా పరిసరాల పరిశుభ్రత పర్యావరణ పరిరక్షణ కోసం స్వర్ణాంధ్ర విశేష సేవలు అందించిందని అది నగర వాసులందరికీ సుపరిచితమే అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చే బెస్ట్ స్వచ్ఛత అవార్డు అందుకున్న స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు గుబ్బల రాంబాబుని స్వర్ణాంధ్ర కార్యవర్గం తరఫున సత్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ మారిశెట్టి జితేంద్ర, విశ్రాంత డీఎస్పీ వాసంశెట్టి గోపాలకృష్ణ, సీపీ రెడ్డి హీరో అధినేత చింతా ప్రసాద్‌రెడ్డి, తెలుగుదేశం నాయకులు ఉప్పులూరి జానకిరామ్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు తెలపూడి సత్యనారాయణ, లెక్చరర్ శ్రీనివాసరెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొప్పన నాగేశ్వరరావు స్వర్ణాంధ్ర వ్యవస్థాపకులు పడాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు


పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న రాంబాబు, శ్రీనివాసరావు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయ విజిలెన్స్ ఆఫీసర్ ఈ రాంబాబు సూచించారు. మంగళవారం హుకుంపేటలోని బొప్పన సావిత్రమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు, బ్యాంకు రీజనల్ మేనేజర్ ఎ.శ్రీనివాసరావు, మోరంపూడి బ్రాంచి మేనేజర్ కె.వెంకటసందీప్, పాఠశాల హెచ్ఎం బీఎస్‌వీమూర్తి మొక్కలు నాటి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా రాంబాబు, శ్రీనివాసరావు మాట్లాడుతూ సైబర్‌నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ స్టాఫ్ సెక్రటరీ రమణ, బ్యాంకు యూనియన్ నాయకులు సీహెచ్ వెంకటరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి, హాస్టళ్ల ఆకస్మిక తనిఖీ

కంబాలచెరువు: ప్రభుత్వ ఆసుపత్రి, సాంఘిక సంక్షేమ హాస్టళ్లను జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను నేరుగా వారినే అడిగి తెలుసుకున్నారు. రోగులు వైద్య పరీక్షలకు బయటకు వెళ్లే పని లేకుండా అన్ని పరీక్షలు ఆసుపత్రిలో జరిగేలా ఏర్పాటు చేస్తామన్నారు. ఖాళీగా ఉన్న వైద్యాధికారుల పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను కలెక్టర్ తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో విద్యార్థులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తల్లికి వందనం జమ కాలేదని, టాయిలెట్ల నిర్వహణ బాగోలేదని తదితర సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

పీహెచ్‌సీల వద్ద ఆశా వర్కర్ల ధర్నా


కాతేరులో ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

రాజమహేంద్రవరం రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని పీహెచ్‌సీల వద్ద ఆశా వర్కర్లు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు సుందరబాబు, ఆశ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటలక్ష్మి, అధ్యక్షుడు కె.అన్నామని మాట్లాడుతూ ఆశా వర్కర్లకి కనీస వేతనాలు ఇవ్వాలని, డ్యూటీలో ఉన్న ఆశా వర్కర్ మరణిస్తే 20వేలు మట్టి ఖర్చులు ఇవ్వాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌ని ఆశ వర్కర్లుగా మార్పు చేయాలని, అన్ని రకాల సెలవులు వర్తింపచేయాలని అన్నారు. ఏఎన్ఎం, జీఎన్ఎమ్ ట్రైనింగ్ అయిన అయినటువంటి ఆశ వర్కర్లకి వెయిటేజ్ మార్కులు కల్పించాలని, పీహెచ్‌సీకి వెళ్లిన ప్రతిసారి టీఏ, డీఏలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కోశాధికారి జి.బేబీ కుమారి, జిల్లా కమిటీ సభ్యులు ఎ.అనూష, కె.వెంకటలక్ష్మి, హైమావతి, శివకుమారి పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల ర్యాలీ


సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ ప్రధాన కార్యదర్శి డీవీ రమణ తొలిసారిగా బుధవారం జిల్లాకు వస్తున్న సందర్భంగా ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు నగర ఎన్జీవో సంఘ ఇన్‌చార్జి అధ్యక్షులు అనిల్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్జీజీవో హోమ్‌లో రాజమహేంద్రవరం నగర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ ర్యాలీ మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక శ్యామల థియేటర్ నుంచి రంభ ఊర్వశి సెంటర్, జాంపేట, నందం గన్నిరాజ్ జంక్షన్ మీదుగా ఆనం రోటరీ హాల్‌కు చేరుతుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 24 తాలూకా యూనిట్ల నుంచి ఉద్యోగులు ఈ ర్యాలీకి హాజరవుతారన్నారు. జేఏసీ కార్యదర్శి వేణుమాధవ్ మాట్లాడుతూ జేఏసీ సభ్య సంఘాలన్నీ పాల్గొనాలన్నారు. నగర కార్యదర్శి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తూర్పుగోదావరి జిల్లా ఎన్జీవో సంఘం నూతన అడహాక్ కమిటీ నియమిస్తారన్నారు. నగర సంఘ ఉపాధ్యక్షుడు మీసాల మాధవరావు, మహిళా చైర్పర్సన్ సత్యవతి, స్టేట్ కౌన్సిలర్ సత్యమూర్తి, ఉపాధ్యక్షుడు రాఘవరావు, కుమార్, రోజా రాణి, దివ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలి

రంగంపేట: ఎంటీఎస్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే కార్యక్రమానికి రాష్ట్రంలోని 1998 ఉపాధ్యాయులందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం నాయకులు ముత్యాల శ్రీనివాసరావు, రమేష్ నాయుడు, మోహనరెడ్డి, ప్రకాష్ తదితరులు కోరారు.

పాము కాటుకు భయపడాల్సిన అవసరం లేదు

రంగంపేట: పాము కాటుకు భయపడాల్సిన అవసరం లేదని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల పాము కాట్ల ఘటనలు కొన్ని చోట్ల నమోదవుతున్నాయి. దీనికి భయపడాల్సిన అవసరం లేదు. పాము కాటు చికిత్సకు కావలసిన ఆంటీ స్నేక్ వెనమ్ (ఎఎస్‌వీ) ఇంజెక్షన్లు రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎప్పటికప్పుడు అందుబాటులో ఉన్నాయి. పాము కాటుకు గురైతే వెంటనే స్థానిక పీహెచ్‌సీ రావాలన్నారు.

దుర్గమ్మకు సామూహిక లక్ష కుంకుమార్చన

అనపర్తి: గ్రామంలోని దుర్గమ్మ అమ్మవారి ఆలయంలో సామూహిక లక్ష కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కెనాల్ రోడ్డులోని అయ్యప్పస్వామి వారి ఆలయ ప్రాంగణంలో మంగళవారం గురుస్వామి పడాల సత్తిరెడ్డిరాజు ఆధ్వర్యంలో మహిళలు పూజలు చేశారు. పురోహితులు రాందేవ్ శర్మ, ధనుంజయ్‌శర్మ పర్యవేక్షణలో ఎంపీటీసీ సభ్యురాలు తుమ్మ రాజేశ్వరి, సత్తిబాబు దంపతులు పీఠలపై కూర్చుని పూజ ప్రారంభించారు. సుమారు 150మంది ముత్తైదువులు కుంకుమార్చనలో పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులకు పసుపు కుంకుమ అమ్మవారి ప్రతిమ మొదలగు పూజ సామగ్రి అందించారు. వచ్చే నెల కార్తిక పౌర్ణమి సందర్భంగా అయ్యప్ప స్వామివారి ఆల ప్రాంగణంలో జరగబోయే కుంకుమ పూజలు, పడిపూజ కార్యక్రమంలో భక్తుల పాల్గొవాలని రాజు గురుస్వామి తెలిపారు.